# మూడు చెక్ బౌన్స్ కేసుల్లో నిందితుడికి జైలు శిక్ష

### ఒక్కో కేసులో ఆరు నెలల చొప్పున శిక్ష విధించిన నాయుడుపేట కోర్టు

### రూ.22 లక్షల విలువైన చెక్కుల బౌన్స్ వ్యవహారంలో తీర్పు

**నాయుడుపేట,పెన్ పవర్, ఆగష్టు 10 :** తిరుపతి జిల్లా నాయుడుపేటలో బాకీ మొత్తాన్ని చెల్లించకుండా చెక్కులు జారీ చేసి అవి బౌన్స్ అయిన కేసుల్లో నేరం రుజువు కావడంతో నిందితుడికి నాయుడుపేట జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు జైలు శిక్ష విధించింది. మూడు కేసుల్లోనూ ఒక్కో కేసుకు ఆరు నెలల చొప్పున శిక్ష విధిస్తూ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పి. మీనాక్షి సుందరి సోమవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాల ప్రకారం.. నాయుడుపేటకు చెందిన మొలకలపూడి మధుసూదన్‌రావు, లక్ష్మీనారాయణ కుమారుడు, రాగి షణ్ముఖ శ్రీనివాస్ వద్ద తీసుకున్న రుణానికి సంబంధించి రూ.12 లక్షలు, రూ.8 లక్షల విలువైన రెండు బ్యాంకు చెక్కులను ఇచ్చారు. అలాగే దాసరి పోలయ్యకు రూ.2 లక్షల విలువైన మరో చెక్కును అందజేశారు. నిందితుడు తీసుకున్న మొత్తాన్ని తిరిగి చెల్లించకపోవడంతో బాధితులు చెక్కులను బ్యాంకుల్లో జమ చేశారు. అయితే ఖాతాల్లో తగినంత నిధులు లేకపోవడంతో మూడు చెక్కులు బౌన్స్ అయ్యాయి. దీంతో షణ్ముఖ శ్రీనివాస్ రెండు చెక్కులకు సంబంధించి రూ.20 లక్షల కోసం, దాసరి పోలయ్య ఒక చెక్కుకు సంబంధించి రూ.2 లక్షల కోసం నాయుడుపేట కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు నమోదైన మూడు చెక్ బౌన్స్ కేసులు కొంతకాలంగా కోర్టులో విచారణలో ఉన్నాయి. ఇరుపక్షాల వాదనలు, సమర్పించిన ఆధారాలను పరిశీలించిన అనంతరం నిందితుడిపై నేరం రుజువైనట్లు న్యాయస్థానం నిర్ధారించింది. దీంతో మూడు కేసుల్లోనూ ఒక్కో






కేసుకు ఆరు నెలల చొప్పున జైలు శిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ పి. మీనాక్షి సుందరి తీర్పు ఇచ్చారు. బాధితులకు న్యాయం జరిగేలా తీర్పు వెలువడటంతో ఈ వ్యవహారం పట్టణంలో చర్చనీయాంశమైందిమూడు కేసులకు సంబంధించిన చెక్కుల మొత్తం విలువ రూ.22 లక్షలుగా ఉంది.

# డీఎస్సీ అక్రమాలపై నిరసన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి



**ఇందుకూరుపేట పెన్ పవర్ ఆగస్ట్ 10:** పోలీసులు అడ్డంకులు సృష్టించినా.. మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి వైసీపీ రాష్ట్ర సిఈసి రాష్ట్ర సభ్యులు పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీకి భారీగా హాజరైన యువత, విద్యార్థులు, వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. డీఎస్సీ అక్రమాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేసి సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ కోవూరు నియోజకవర్గస్థాయిలో ఇందుకూరుపేట మండలంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో ముఖ్య అతిథులుగా గూడూరు రూరల్ మండల పార్టీ అధ్యక్షులు మల్లు విజయ్ కుమార్ రెడ్డి కోట మండల పార్టీ అధ్యక్షులు పలగాటి సంపత్ రెడ్డి చిట్టమూరు మండల పార్టీ అధ్యక్షులు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మెట్టా రాధాకృష్ణారెడ్డి వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఊటుకూరు మహేందర్ రెడ్డి గూడూరు నియోజకవర్గ మాజీ రైతు విభాగం అధ్యక్షులు రాజా రెడ్డి వైసిపి జిల్లా పార్టీ కార్యదర్శి చిట్టమూరు రాజారెడ్డి వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రమణయ్య పాదర్తి రాధాకృష్ణారెడ్డి వెంకు రెడ్డి వైసీపీ నాయకులు.. నల్లపరెడ్డి రజత్ కుమార్ రెడ్డి వీరి చలపతి రావు కొండూరు అనిల్ బాబు గుణపాటి సురేష్ రెడ్డి మరియు ఆరు మండలాల అధ్యక్షులు మవులూరు శ్రీనివాసులురెడ్డి శివుని నరసింహారెడ్డి, చెర్లో సతీష్ రెడ్డి చిమటా శేషగిరి షేక్ షాహుల్ కాటంరెడ్డి నవీన్ రెడ్డి అత్తిపల్లి అనూప్ రెడ్డి మరియు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు..

# ఆరోగ్యం సేవలో ముందున్న దొడ్ల కోదండరామయ్య



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 10 :** గత నాలుగు సంవత్సరాలుగా మహాయాగ ఫౌండేషన్ సహకారంతో బుచ్చిరెడ్డిపాలెం మండల టిడిపి సీనియర్ నాయకులు దొడ్ల కోదండరామయ్య గర్భిణీలకు ఆహారంతో పాటు పౌష్టికాహారం మందులను పంపిణీ చేయడం సంతోషదాయకమని ఆసుపత్రి సూపర్వైజర్ పద్మజ కొనియాడారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన పౌష్టికాహార పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి నెల గర్భిణీలకు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు టిడిపి నాయకులు ఆసుపత్రి కమిటీ చైర్మన్ దొడ్ల కోదండ రామయ్య ఫ్రైడ్ రైస్ పెరుగన్నం పౌష్టికాహారాలు టానిక్స్ పంపిణీ చేస్తున్నారని అన్నారు. తద్వారా గర్భిణీలకు కూడా మంచి ఆరోగ్యంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించుకోవాలని మక్కువ కలుగుతుందని తెలిపారు. దీనిని మండలంలోని గర్భిణీలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. దొడ్ల కోదండ రామయ్య మాట్లాడుతూ సహాయక ఫౌండేషన్ ద్వారా ఇలా గర్భిణీలకు ప్రతి నెల పౌష్టికాహారంతో పాటు ఆహారాన్ని పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే కాలంలో కూడా మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# వైసిపి తప్పుడు ఆరోపణలపై టిడిపి నేతల ఆగ్రహం



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 10 :** డీఎస్సీపై వై సి పిచేస్తున్న తప్పుడు ఆరోపణలపై బుచ్చిరెడ్డిపాలెం టిడిపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 2023లో 2 శాతం స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు ఇవ్వాలని జీఓ నెంబర్ 77 ను తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం ఉద్యోగాలు ఇచ్చి పది నెలలు అయితే విద్యార్థులు ఎవరూ బయటకు రాలేదన్నారు. వైసిపి నాయకులు వారి మనోభావాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. పేకాటలో గెలిస్తే ఎవరికైనా సర్టిఫికెట్లు ఇస్తారా అని ఆయన ప్రశ్నించారు. అధికారులు ఉద్యోగాలు ఇచ్చే సమయంలో సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించి ఎంపిక చేస్తారన్నారు. ఎక్కడ కూడా ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరగలేదన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఉపాధ్యాయ పోస్టులు లక్షల్లో భర్తీ చేశారని ఆయన గుర్తు చేశారు. ప్రతిభ తోనే ఉద్యోగాలు వస్తాయి కానీ పలుకుబడితో కాదన్నారు. వైసిపి తన ఉనికి కోసమే ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తుందని ఆయన విమర్శించారు. ఆధారాలు లేకుండా ఇటువంటి నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గత ఐదేళ్లలో ఉద్యోగాలు లేక యువత అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన పేర్కొన్నారు. సర్టిఫికెట్లలో తప్పులు ఉంటేనే కాల్ లెటర్లు వెనక్కి తీసుకున్నారన్నారు. వైసీపీ నాయకుల తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బత్తల హరిక్రిష్ణ, దుగ్గిశెట్టి హరనాథ్, పటేల్ రెడ్డి, టంగుటూరు మల్లా రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ వింజం రామానాయుడు, పార్లమెంటు ఉపాధ్యక్షులు ఎంవి శేషయ్య స్థానిక టిడిపి నేతలు పాల్గొన్నారు.

# నెల్లబల్లి ప్రభుత్వ రెవెన్యూ భూముల్లో ఎర్రమట్టి దొంగలు పడ్డారు

" పట్టుకునే అధికారులు ఎవరు?

పట్టపగలే ప్రభుత్వ భూముల్లో ఎర్ర మట్టి దొంగలు పడ్డారు

అక్రమ గ్రావెల్ త్రవ్వకాల్లో అధికారులు మౌనం వహించారు

చదునుగా ఉన్న ప్రభుత్వ భూములు అస్తవ్యస్తం చేస్తున్నారు.

గ్రావెల్ త్రవ్వకాలు వెనుక మాఫియా డాన్ లు ఎవరు?

గ్రావెల్ త్రవ్వకాలు తెలిసిన పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు







**సూళ్లూరుపేట, పెన్ పవర్, ఆగష్టు 10:** దొరవారి సత్రం మండల పరిధిలోని నెల్లబల్లి రెవెన్యూ సర్వేనెంబర్ 323/2,324/1,332/2లా లో గల ప్రభుత్వ భూమిలో పగలు, రాత్రి తేడా లేకుండా భారీ యంత్రాలతో ఎర్ర గ్రావెల్ తరలించకపోతున్న ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదు. మాఫియా నాయకులకు అధికారులు సహకారం అందిస్తున్నారన్నది ప్రజలు విమర్శిస్తున్నారు. స్థానిక గ్రామపంచాయతీలో భారీ మట్టి కుంభకోణం జరుగుతున్న స్థానిక టిడిపి నేతలు ఎందుకు స్పందించడం లేదని పలు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. కట్టడి చేయాల్సిన స్థానిక తాసిల్దార్, వీఆర్వో కు సమాచారం అందించిన స్పందించి కట్టడి చేయకపోవడంతో అక్రమ మట్టి త్రవ్వకందారులకు సహాయ సహకారాలు అందిస్తున్నారా అనే విమర్శలు కూడా చేస్తున్నారు. అనుమతులు లేని, నిబంధనలకు విరుద్ధంగా భారీ గ్రావెల్ తరలించకపోతున్న రెవెన్యూ అధికారుల స్పందన లేకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటి అని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డివిజన్, జిల్లాస్థాయి అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామపంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

# రొయ్యల ఫీడ్ ఫ్యాక్టరీ దుర్వాసన నుంచి ప్రజలను కాపాడాలి

### భారీ ర్యాలీగా గూడూరు ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం






**గూడూరు,పెన్ పవర్,ఆగస్టు 10:** గూడూరు రూరల్ మండలం వేడిచర్ల రెవెన్యూ పరిధిలోని రొయ్యల ఫీడ్ ఫ్యాక్టరీ (రఘురామ్ ఇండస్ట్రీస్) నుంచి వెలువడుతున్న దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నెర్నారు, కొమ్మునేటూరు, చేమిర్తి, వేడిచర్ల గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ నుంచి తరచూ వెలువడుతున్న దుర్వాసనతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆరోపిస్తూ సోమవారం బాధిత గ్రామాల ప్రజలు గూడూరు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న గ్రామస్థులు అక్కడ నిరసన వ్యక్తం చేసి, అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న దుర్వాసన కారణంగా సాధారణ జీవనం సాగించడం కూడా కష్టంగా మారిందన్నారు. ముఖ్యంగా గర్భిణీలు, చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దుర్వాసన కారణంగా ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడుతోందని, రోజువారీ పనులు చేసుకోవడానికీ ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే ఫ్యాక్టరీపై సమగ్ర విచారణ చేపట్టి, దుర్వాసన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే పరిస్థితులు కొనసాగితే ఫ్యాక్టరీని మూసివేయాలని వారు కోరారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని గ్రామస్థులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజా ప్రతినిధులు, బాధిత గ్రామాల ప్రజలు పార్టీలకతీతంగా పాల్గొన్నారు.

# పరిమళ వెంకటేశ్వర్లుకు కాంగ్రెస్ నేతల ఘన నివాళి





**గూడూరు,పెన్ పవర్,ఆగస్టు 10:** గూడూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ నియోజకవర్గ ఇంచార్జి పరిమళ వెంకటేశ్వర్లు మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం గూడూరులో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల గురువం బాబుతో పాటు జిల్లా, మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిమళ వెంకటేశ్వర్లుకు నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ కోసం ఆయన చేసిన సేవలను, పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని నాయకులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. గూడూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలు పనిచేసిన పరిమళ వెంకటేశ్వర్లు మృతి పార్టీకి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. ఆయన లేని లోటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, అభిమానులకు ఎప్పటికీ తీరదని అన్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరిమళ వెంకటేశ్వర్లు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# దేవాదాయ అధికారి పై విచారణకు ప్రత్యేక బృందం

### మంత్రి ఆనం ఆదేశాలతో గూడూరుకు చేరుకున్న అధికారులు

**గూడూరు,పెన్ పవర్,ఆగస్టు 10:** గూడూరు దేవాదాయ శాఖ అధికారిపై పలువురు ఆలయ పాలక మండలి సభ్యులు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు స్పందించారు. మంత్రి ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ ప్రత్యేక అధికారుల బృందం సోమవారం గూడూరుకు చేరుకుని అధికారిపై వచ్చిన ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టింది. విచారణ బృందంలో గుంటూరు రీజనల్ దేవాదాయ శాఖ ప్రతినిధితో పాటు పలువురు ఈఓలు, మహిళా అధికారులు ఉన్నట్లు సమాచారం. ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలపై సంబంధిత వ్యక్తులను విచారిస్తూ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇటీవల మంత్రి ఆనంను కలిసిన ఆలయ పాలక మండలి సభ్యులు, స్థానికుల నుంచి దేవాదాయ అధికారి వ్యవహారశైలిపై మంత్రి ఆరా తీసినట్లు సమాచారం. విచారణ అనంతరం ఉన్నతాధికారులకు సమర్పించే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉండే అవకాశం ఉంది.

# శ్రీవారి సేవకు రూ.15 లక్షల ట్రక్

**టీటీడీకి వాహన విరాళం**

**టీటీడీకి రూ.15.24 లక్షల విలువైన ట్రక్కు విరాళం**

**తిరుపతికి చెందిన శ్రీ వేంకటేశ్వర మోటార్స్ సంస్థ అందజేత**

**శ్రీవారి ఆలయం ఎదుట వాహనానికి పూజలు, తాళాలు అందజేత**

**తిరుమలలో భారీగా కొనసాగుతున్న భక్తుల రద్దీ**

**సర్వదర్శనానికి 20 నుంచి 24 గంటల సమయం**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కు సోమవారం ఓ భారీ విరాళం అందింది. తిరుపతికి చెందిన శ్రీ వేంకటేశ్వర మోటార్స్ సంస్థ, టీటీడీ రవాణా అవసరాల నిమిత్తం తమవంతు సహాయంగా ఓ నూతన ట్రక్కును విరాళంగా అందించింది. సుమారు రూ.15.24 లక్షల విలువైన ఈ ఎస్.ఎం.ఎల్. మహీంద్రా ట్రక్కును సంస్థ మేనేజింగ్ పార్టనర్ లోకనాథ రెడ్డి అందజేశారు. సోమవారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు దాత లోకనాథ రెడ్డి కుటుంబ సమేతంగా వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, వాహనానికి సంబంధించిన తాళాలను శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథంకు భక్తిశ్రద్ధలతో అందజేశారు. శ్రీవారి సేవలకు భక్తులు నగదు, బంగారం వంటి కానుకలతో పాటు, ఇలా వాహనాలను కూడా విరాళంగా అందిస్తుండటం తెలిసిందే. ఈ ట్రక్కును టీటీడీ తన రవాణా అవసరాల కోసం వినియోగించనుంది.

**తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ :** మరోవైపు, తిరుమల కొండపై భక్తుల రద్దీ అధికంగా కొనసాగుతోంది. నిన్న ఆగస్టు 9న ఒక్కరోజే 87,179 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ.4.59 కోట్లుగా నమోదైంది. అదేవిధంగా, 34,256 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తుల రద్దీ కారణంగా



సర్వదర్శనం టోకెన్లు లేని వారికి శ్రీవారి దర్శనానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం పడుతోందని అధికారులు తెలిపారు. క్యూలైన్లు వైకుంఠం కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, శిలాతోరణం వరకు బయటకు విస్తరించాయి. టీటీడీ అన్నప్రసాద విభాగం ద్వారా 3.11 లక్షల మందికి, అశ్విని ఆసుపత్రిలో 3,538 మందికి సేవలు అందించినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు.

